వార్షిక క్రీడా దినోత్సవాన్ని విజయవంతం చేయండి

రెబ్బెన, ఫిబ్రవరి 8: బెల్లంపల్లి ఏరియాలోని గోలేటిటౌన్‌షిప్ సింగరేణి హైస్కూల్ క్రీడా మైదానం లో ఈ నెల 11న నిర్వహించు సింగరేణి వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ 90వ వార్షిక క్రీడా వేడుకలను విజయవంతం చేయాలని బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాలబాలికలకు, అధికారులకు, అధికారుల సతీమణులకు, కార్మికులకు, కార్మికుల సతీమణులకు వివిధ రకాల క్రీడాపోటీలు నిర్వహించి బహుమతులు అందిస్తామన్నారు. వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామని తెలిపారు.

గడువు పొడిగింపు

రెబ్బెన, ఫిబ్రవరి 8: బెల్లంపల్లి ఏరియా లోని వివిధ గనులు, డిపార్టుమెంట్‌లలో యూనిట్ రేట్ సిస్టం ప్రకారం అద్దె ప్రాతిపాదికన 3 సంవత్సరాల పాటు వినియోగించేందుకు 8 ఎనిమిది 2WD| 4WD (వీల్ డ్రైవ్) వాహనాల కోసం ఆసక్తి కలిగిన వారి నుంచి టెండర్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సింగరేణి యాజమాన్యం గతంలో ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రస్తుతం ఉపరితల గనుల్లో నడిచే వాహనాలకు కొత్తరేట్లు వర్తించనున్నందున మరోక వాహనం చేరుస్తూ మొత్తం 9వాహనాలకు టెండర్ దరఖాస్తు గడువును ఈ నెల 10 సాయంత్రం 5 గంటల వరకు గడువు పొడిగించినట్లు సింగరేణి యాజమాన్యం తెలిపింది. భూనిర్వాసిత కుటుంబాలకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాల కోసం గోలేటి జీఎం కార్యాలయం లోని పర్చేస్ డిపార్టుమెంట్ లేదా సంస్థ వెబ్‌సైట్ www.scclmines.com సంప్రదించాలని సూచించారు.

11న గురుకుల పరీక్ష

రెబ్బెన, ఫిబ్రవరి 8: మండల కేంద్రం లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో 11న (ఆదివారం) 5వ తరగతి గురుకులాల ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ జ్యోతి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్ష రాస్తున్న వారు ఉదయం 9 గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. వివరాలకు 7995010577ను సంప్రదించాలన్నారు.

అడవులకు హాని కలిగిస్తే చర్యలు

- జోడేఘాట్ ఇన్‌చార్జి రేంజర్ జ్ఞానేశ్వర్
- లింగాపూర్ మండలంలో అటవీ అధికారుల కార్డెన్ సెర్చ్
- 4 కట్టెకోత మిషన్లు, రూ. 70 వేల కలప పట్టివేత

గ్రామస్తులతో మాట్లాడుతున్న అటవీశాఖ అధికారులు,సిబ్బంది

లింగాపూర్/జైనూర్,ఫిబ్రవరి 8: అడవులకు హానీ కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జోడేఘాట్ ఇన్‌చార్జి రేంజర్ జ్ఞానేశ్వర్ హెచ్చరించారు. లింగాపూర్ మండలంలోని నిమ్మతండా,పిక్లనాయక్ తండా,వంజర్‌గూడ, మామిడిపల్లి, లింగాపూర్, బాండయేర్, మహగాం తదితర గ్రామాల్లో జిల్లా అటవీశాఖ అధికారుల ఆదేశాల మేరకు ఆసిఫాబాద్,జోడేఘాట్, కెరమెరి రేంజీల పరిధిల్లోని అటవీ సిబ్బందితో గురువారం కార్డెన్‌సెర్చ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవులకు,అటవీ జంతువులకు ఎలాంటి హానీ కలిగించినా తీవ్రమైన చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమంగా అడవుల నుంచి కలప తరలించినా,నిల్వ చేసినా, ఫర్నిచర్ రూపంలో తరలించినా,అటవీ జంతువులను వేటాడినా కఠిన చర్యలు తప్పవని గ్రామస్తులకు సూచించారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అడవుల సంరక్షణ కోసం కోట్లాది రూపాయలు వెచ్చించి అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు.అడవులతో పాటు జంతు సంపదనను కాపాడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని సూచించారు. పిక్లనాయక్ తండాలో4 కట్టెకోత మిషన్లు, ఆయా గ్రామాల్లో టేకు దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.70 వేల వరకు ఉంటుందని పేర్కొన్నారు. పట్టుకున్న కట్టెకోత మిషన్లతో పాటు కలపను రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు. ఈ కార్డన్ సెర్చ్‌లో కెరమెరి,ఆసిఫాబాద్,రేంజర్లు మజారోద్దీన్, అప్పకొండ, ఆయా రేంజీల ఎఫ్ఎస్‌వోలు, ఎఫ్‌బీవోలు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.

కుష్టు వ్యాధి నివారణపై అవగాహన

వాంకిడి: ప్రతిజ్ఞ చేస్తున్న హెచ్ఈవో,ఉపాధ్యాయులు విద్యార్థులు

వాంకిడి,ఫిబ్రవరి 8: మండల కేంద్రం లోని ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల, సాయి గోపాల పాఠశాలలో కుష్టు వ్యాధి నిర్మూలనపై గురువారం హెచ్ఈవో రవిదాస్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చర్మంపై తెల్లని, ఎర్రని, రాగి వర్ణం కలిగిన మచ్చలు స్పర్శజ్ఞాన్నాని కోల్పోయి, నరాల్లో నోప్పి, వాపు కలిగి ఉండాన్ని ప్రధాన లక్షణాలుగా గుర్తించాలన్నారు. ఇలాంటి లక్షణాలున్న వారు పీహెచ్‌సీ,ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా మందులు పొందాలన్నారు.అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో హెచ్ఈఓ రవిదాస్ కుష్టు వ్యాధి నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

ధబోలి జీపీని సందర్శించిన అదనపు కలెక్టర్

జైనూర్ : ధబోలిలో చేపడుతున్న పనుల వివరాలను అడిగి తెలుసుకుంటున్న జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

జైనూర్,ఫిబ్రవరి 8 : మండలంలోని ధబోలి గ్రామపంచాయతీలో గురువారం జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామపంచాయతీలో ప్రత్యేక అధికారి చేపడుతున్న పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈనెల 7 నుంచి 15 వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా ధబోలి గ్రామపంచాయతీని సందర్శించినట్లు ఆయన తెలిపారు. బోరుబావిలో క్లోరినేషన్ గ్రామపంచాయతీ పరిధిలోని మురుగు కాలువలో బ్లీచింగ్ పౌడర్, మురుగు కాల్వల పరిశుభ్రత తదితర విషయాలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథకు సంబంధించిన మంచినీరు ప్రతి ఇంటికి వస్తుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి ప్రభుదయకు పారిశుధ్య పనులు, శానిటైజేషన్ చేయించాలని సూచించారు. గ్రామపంచాయతీ కార్యాలయ రికార్డులను పరిశీలించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను సందర్శించి అక్కడే ఉన్న హెచ్ఎంను పాఠశాలకు మంచినీటి సౌకర్యం ఉన్నదా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రాన్ని కూడా సందర్శించి పేద పిల్లలకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో నీటి సౌకర్యం లేదని తెలుపగా జీపీ నిధులనుంచి జీపీ నుంచి పైపులైను వేసి మంచినీరు అందించాలని ప్రత్యేకాధికారికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభుదయ ఎంపీవో గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారి, పంచాయతీ కార్యదర్శి శ్రీరాం ప్రసాద్, మాజీ సర్పంచ్ ,మల్టీపర్పస్ కార్మికులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వివరాలు నమోదు చేసుకోవాలి

రెబ్బెన, ఫిబ్రవరి 8: విద్యుత్ వినియోగదారులు గృహజ్యోతి పథకం కోసం విద్యుత్ సహాయ ఇంజనీర్ కార్యాలయం, విద్యుత్ సహాయ గణక అధికారి కార్యాలయంలో వివరాలు ధ్రువీకరించుకోవాలని రెబ్బెన ట్రాన్స్‌కో ఏఈ ఇమ్రాన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాపాలనలో అందించిన రసీదు, ఆహార భద్రత కార్డునంబర్, ఆధార్‌కార్డు నంబర్, ఫోన్ నంబర్ దగ్గర ఉంచుకోవాలని, సిబ్బంది వచ్చినప్పుడు వారికి వివరాలు అం దించాలని, అందుబాటులో లేకపోతే దగ్గరలో ఉన్న సబ్‌స్టేషన్‌కు వెళ్లి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

బహుమతుల ప్రదానం

కెరమెరి, ఫిబ్రవరి 8: మండలంలోని పోతరాజు ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కబడ్డీ పోటీల్లో విజేతలైన వారికి నిర్వాహకులు బహుమతులను ప్రదానం చేశారు. రెండు రోజుల పాటు పోటాపోటీగా సాగిన ఈ క్రీడల్లో ప్రథమ బహుమతిని కొలాం కొటారి గ్రామానికి చెందిన జైభీం జట్టు గెలుపొందగా, సాంగ్వీ గ్రామంలోని భజరంగ్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. గెలుపొందిన క్రీడాకారులకు ఎంపీపీ పెందోర్ మోతీరాం, వైస్ ఎంపీపీ అబూల్ కలాం చేతుల మీదుగా నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుడ్మెత సోము, కుమ్రం భీంరావ్, నాణేశ్వర్, జగన్నాథ్ రావ్, ఆత్రం రాముతో పాటు నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందజేత

దహెగాం,ఫిబ్రవరి8 : ఈనెల 16 చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెకోసం గురువారం ఐకేపీ వీవోఏలు ఏపీఎంకు సమ్మె నోటీస్‌ను అందజేశారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్మిక వ్యతిరేక విధానాల పట్ల అఖిలపక్ష కార్మిక సంఘాలు ఇచ్చిన సమ్మెలో పాల్గొని జయప్రదం చేసేందుకు తాము కూడ పాల్గొనన్నుట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీవోఏలు ప్రపూర్ణ, మాధవి,లక్ష్మి, పెంటయ్య,తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్టును వినియోగించుకోవాలి

బెజ్జూర్, ఫిబ్రవరి 8 : పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈనెల 11న టాలెంట్ టెస్టును నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మిడి భీమేశ్ అన్నారు. గురువారం ఆయన మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి టాలెంట్ టెస్టుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఈ టెస్టు చాలా ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. అదేవిధంగా పరీక్ష విధానం, సమయపాలన తొందరపాటు తదితర సమస్యలను విద్యార్థులు తెలుసుకొని విద్యార్థులు పరీక్షలకు సిద్ధమయ్యే అవకాశాలుంటాయని ఆయన చెప్పారు. విద్యార్థులు ఈ టెస్టులో పాల్గొని సద్వి నియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు మండల కేంద్రంలోని జడ్పీ హెచ్ఎం వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు సాయిరాం, రామగిరి అర్జున్, రాదండి సాయి, క్రాంతి, పాల్గొన్నారు.

'గృహజ్యోతి'ని సద్వినియోగం చేసుకోండి

వాంకిడి, ఫిబ్రవరి 8 : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న గృహజ్యోతి పథకాన్ని అర్హులైన విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసు కోవాలని ఏడీఈ శ్రీనివాస్ తెలిపారు. గురువారం మండలంలోని ఖమానలో 'గృహజ్యోతి'నమోదు ప్రక్రియను వాంకిడి(ఏఈ) శ్రీకాంత్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గురువారం ఖమానలో బిల్లింగ్ చేపట్టామన్నారు.'గృహజ్యోతి'కి 200ల యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం అర్హులైన వారు రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, ప్రజాపాలన రశీదు, ఫోన్ నంబర్‌ను అందుబాటులో ఉంచుకొని బిల్లింగ్ చేసే సమయంలో నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో లైన్‌మన్,మీటర్ రీడర్ సిబ్బంది,విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

తిర్యాణి, ఫిబ్రవరి 8 : వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని 30 పడకల దవాఖాన వైద్యు లు హర్షవర్ధన్ అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని, డయాసీస్ ఆఫ్ హ్యూమన్ ప్రమోషన్ సొసైటీ,కారితాన్ ఇండియా సహకారంతో ఉజ్వల కార్యక్రమంలో భాగంగా మండలంలోని గిన్నెధరి బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం క్యాన్సర్,ఇతర సంక్రమిత వ్యాధులపై అవగాహన కల్పించారు. వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. అనంతరం విద్యార్థులకు పండ్లు, బిస్కెట్లు అందజేశారు. ఈ అవగాహన సదస్సులో ట్రైబల్ సొసైటీ డైరెక్టర్ కిరణ్, ఉజ్వల త్రీ సంస్థ కోఆర్డినేటర్ దేవీదాస్, కమ్యూనిటీ ఎడ్యుకేటర్లు శేఖర్,రమాదేవి,ప్రధానోపాధ్యాయులు రాంషా,వార్డన్ లక్ష్మి, ఉపాధ్యాయులు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బందికి వివరాలివ్వాలి

తిర్యాణి,ఫిబ్రవరి 8: గృహలక్ష్మి అమలు కోసం విద్యుత్ బిల్లులు తీసుకోవడానికి వచ్చే విద్యుత్ సిబ్బందికి లబ్ధిదారులు సర్వీసు వివరాలు ఇవ్వాలని ఏఈ కవిత, లైన్‌మన్ నిరంజన్ తెలిపారు. ఆధార్,రేషన్ కార్డు,ఫోన్ నంబర్‌తో పాటు ప్రజాపాలనలో చేసుకున్న దరఖాస్తు రశీదులను చూపించాలన్నారు.అద్దెఇంట్లో ఉన్నవారికి కూడా వివరాలు ఇదే తరహాలో ఇవ్వాలని కోరారు. 72ఎఎస్‌బి08: ఖైర్‌గూడ ఓసీపీలో ఓబీ కాంట్రాక్టు కార్మికులతో మాట్లాడుతున్న ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బయ్య మొగిలి

కార్మికుల సమస్యలపై నిరంతర పోరాటం

- ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతి

మాట్లాడుతున్న ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతి

రెబ్బెన, ఫిబ్రవరి 8: సింగరేణి సంస్థలో విధులు నిర్వహించు కార్మికుల సమస్యలపై ఏఐటీయూసీ యూనియన్ నిరంతరం పోరాటం చేస్తుందని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ కార్యదర్శి ఎస్.తిరుపతి, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బయ్య మొగిలిలు స్పష్టం చేశారు. ఏరియాలోని గోలేటిటౌన్‌షిప్‌లోని కేఎల్ మహేంద్ర భవన్‌లో గురువారం ఏఐటీయూసీ జనరల్ బాడీ సమావేశం నిర్వహించగా ముఖ్యఅతిథులుగా వారు హాజరై మాట్లాడారు. కార్మికులు గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో గెలిపించారని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా కార్మికులకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. మ్యానిఫెస్టోలో పెట్టిన 49 అంశాలను దశలవారీగా సాధించడంతో పాటు స్థానికంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ ఆర్గనైజింగ్ కార్యదర్శులు జగ్గయ్య, శేషు, శివరావు, కిరణ్‌బాబు, జూపాక రాజేశ్, మీసా చంద్రశేఖర్, ఆనంద్, దివాకర్, ఫిట్ కార్యదర్శులు అశోక్, రామయ్య, నాయకులు శ్రీనివాస్, రాజయ్య, సురేశ్‌కోరి, వేణుగోపాల్, అమర్‌సింగ్, శ్రీపాల్, శ్రీనివాస్ లతో పాటు పలువురు ఉన్నారు.

● గోలేటి సీహెచ్‌పీ కమిటీ ఎన్నిక

బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీ ఏఐటీయూసీ కొత్త కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, ఉపాధ్యక్షుడు బయ్య మొగిలిలు పేర్కొన్నారు. గోలేటి సీహెచ్‌పీ ఫిట్ కార్యదర్శిగా ఎంబడి రామయ్య, సహాయ కార్యదర్శిగా ఎల్లూరు శ్రీనివాస్, ఏ రిలే షిఫ్ట్ ఇన్‌చార్జిగా అమర్‌సింగ్, బి రిలే షిఫ్ట్ ఇన్‌చార్జిగా చంద్రయ్య, సీ రిలే షిఫ్ట్ ఇన్‌చార్జిగా కుసుమ శ్రీనివాస్, జనరల్ షిఫ్ట్ ఇన్‌చార్జిగా ఎండీ అదం సమీలతో పాటు మైన్స్, సేఫ్టీ కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

కార్మికుల సమావేశాన్ని విజయవంతం చేయండి

రెబ్బెన, ఫిబ్రవరి 8: గోదావరిఖని భాస్కరభవన్ లో శుక్రవారం సింగరేణి ప్రైవేట్ ఓబీలలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న సమావేశాన్ని కాంట్రాక్టు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బయ్య మొగిలి, కాంట్రాక్టు కార్మిక సంఘం అధ్యక్షుడు రాయిళ్ల నర్సయ్యలు పిలుపునిచ్చారు. బెల్లంపల్లి ఏరియా లోని ఖైర్‌గూడ ఓసీపీ లో గల ఓబీ లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులతో సమావేశం నిర్వహించి ముఖ్య అతిథులుగా వారు హాజరై మాట్లాడారు. ఓబీలలో విధులు నిర్వహించు కాంట్రాక్టు కార్మికుల వేతనాలు, సౌకర్యాలు గురించి సమావేశంలో చర్చించటం జరుగుతుందని, ఈ సమావేశానికి ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ఉప ప్రధాన కార్యదర్శి ముస్కే సమ్మయ్య, కాంట్రాక్ట్ వర్కర్స్ రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర తిరుపతి, ప్రధాన కార్యదర్శి అక్బర్‌అలీ లు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. గోలేటి ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

గాండ్ల తెలికులస్తుల అభివృద్ధికి కృషి చేయాలి

ఆసిఫాబాద్,ఫిబ్రవరి8: జిల్లాలో పది వేలకు పైన జనాభాను కలిగి ఉన్న గాండ్ల తెలికులస్తులను ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో అన్నివిధాలుగా అభివృద్ధి పర్చాలని రాష్ట్ర సమన్వయ కమిటీ అధ్యక్షుడు రవికుమార్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో జరిగిన అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం ఐక్యత–అభివృద్ధి సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో వాంకిడి మాజీ సర్పంచ్ బండె తుకారాం, రాష్ట్ర యువజన అధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు హిప్రే సందీప్, ఆసిఫాబాద్ మండలాధ్యక్షుడు సెండే మురళీ కృష్ణ, ప్రధాన కార్యదర్శి కవల్కర్ యాదవ్, నాయకులు కవల్కర్ ఆనంద్ రావు, తపసే పోచ్చన్న, కవల్కర్ఉద్ధవ్, రవీందర్, హిప్రే శ్రవణ్, కవల్కర్ సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

బడి బయటి పిల్లల వివరాల సేకరణ

కౌటాల, ఫిబ్రవరి 8 : కౌటాల, చింతలమానెపల్లి మండలాల్లోని బడి బయటి పిల్లల వివరాలను గురువారం ఎమ్మార్సీ భవనంలో సేకరించారు. ఇందులో భాగంగా బడి బయటి పిల్లల వివరాలు, పిల్లల రిజిష్టర్‌ల వివరాల నమోదు, అన్ని కరెక్టుగా నమోదు చేయాలని ఎంఈవో సోమయ్య సూచించారు. ప్రతి పాఠశాల పరిధిలోని విద్యార్థుల వివరాలను తప్పకుండా నమోదు చేయాలని ఆయన సూచించారు. ఆయనతో పాటు ముత్తంపేట కాంప్లెక్స్ హెచ్ఎం గావుడే హన్మంతు, కౌటాల హెచ్ఎం నారాయణ సింగ్, చింతలమానెపల్లి ఎంఎన్‌వో జయరాజు, సీఆర్‌పీలు మహేశ్, ప్రకాశ్, దేవన్న, లాలాజీ, సుమన్, లుల్లాజీ, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి

కాగజ్‌నగర్ టౌన్, ఫిబ్రవరి 8 మండలంలోని చింతగూడలో ఉపాధి హామీ పనులను గురువారం జీపీ కార్యదర్శి కుమ్మరి హరీశ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఉపాధి పనులపై కూలీలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూలీలందరూ ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ సుద్దాల రాజు ఉన్నారు.

21లోగా ఓపెన్ పది, ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లించాలి

కాగజ్‌నగర్ టౌన్, ఫిబ్రవరి 8 ఓపెన్ పది, ఇంటర్మీడియెట్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఈనెల 21లోగా పరీక్ష ఫీజు చెల్లించాలని జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ ప్రమిల, అసిస్టెంట్ కోఆర్డినేటర్ సాయిని సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

బీమా చెక్కు అందజేత

కౌటాల, ఫిబ్రవరి 8: మండల కేంద్రానికి చెందిన బసార్కర్ దివాకర్ గతంలో టీజీబీ బ్యాంకులో రూ.436 లతో సాధారణ బీమా చేసుకున్నాడు. అనారోగ్యం కారణంగా ఇటీవల ఆయన మృతి చెందడంతో గురువారం అతని భార్య సులోచనకు రెండు లక్షల బీమా చెక్కును టీజీబీ మంచిర్యాల ఏరియా జీఎం మురళీ మనోహర్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు టిజిబి బ్యాంకులో తక్కువ ప్రీమియం తో ఎక్కువ లాభాలు గల ఇన్సూరెన్స్ పథకాలు అందుబాటులో ఉన్నట్లు, అం దువల్ల ప్రతి ఒక్కరూ బీమా చేసుకో వాలని ఆయన తెలిపారు. ఆయ న వెంట కౌటాల, ముత్తంపేట మేనేజర్లు నరసింహ స్వామి, అజేష్, అకౌంటంట్ రాజేశ్, క్యాషియర్‌లు భాస్కర్, గోపీ, సిఎస్పీ ప్రకాశ్, మోరేష్, ఐకెపీ సిబ్బంది కుసుమ, తిరుపతి, తదితరులున్నారు..

విద్యుత్ అధికారులకు సహకరించాలి

బెజ్జూర్, ఫిబ్రవరి 8 : గృహజ్యోతి పథకం అర్హత కోసం వినియోగదారులు సంబంధిత ఆధారపు పత్రాలు విద్యుత్ అధికారులకు సకాలంలో అందించి సహకరించాలని జిల్లా అకౌంటెంట్ అధికారి ఈశ్వర్, అసిస్టెంట్ అకౌంటెంట్ అధికారి తుకారాం అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు ఎల్కపల్లి తదితర గ్రామాల్లో వారు వినియోగదారుల ఇంటింటికీ వెళ్లి పత్రాలు స్వీకరించారు. వినియోగదారులను కరెంట్ బిల్లులకు అనుసంధానం చేయడంలో భాగంగా వినియోగదారులు వారి రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, సెల్ నంబరుతో పాటు ప్రజాపాన దరఖాస్తు యొక్క రశీదు సీరియల్ నంబరు కూడా అధికారులకు అందజేయాలని వారు సూచించారు. వారి వెంట కౌటాల ఏడీఈ రాజేశ్వర్, బెజ్జూర్ ఏఈ అంజల్ కుమార్, సిబ్బంది రాజేశం, రాజు, బాలాజీ తదితరులు ఉన్నారు.

ముగిసిన అఖండ హరినామ సప్తాహం

కీర్తన కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీ సంత్ కొడప వినాయక్ మహారాజ్

సిర్పూర్(యు) ఫిబ్రవరి 8 : మండలంలోని మహాగాంవ్‌లో సురోజీ బాబ ఆశ్రమం పీఠాధిపతి మెస్రం కైలాష్ మహారాజ్ ఆధ్వర్యంలో వారం రోజులుగా కొన్నసాగుతున్న సంత్ సురోజీ బాబ అఖండ హరినామ సప్తాహ కార్యక్రమం గురువారంతో ముగిసింది. ఈ అఖండ హరినామ సప్తాహంలో వివిధ ప్రాంతాల నుంచి సంత్ (మహారాజ్‌లు) పాల్గొని వారంపాటు భజన,కీర్తనాలు ఆధ్యాత్మిక కార్యక్రమం చేసి ప్రతిరోజు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. బుధవారం కైలాష్ టెకిడి శివాలయంలో ప్రత్యేక పూజలు చేసి గురువారం అఖండ హరినామ సప్తాహం చివరి రోజున (కాళ) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సంత్ కొడప వినాయక్ మహారాజ్ పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సంత్ సురోజీ బాబను ఆదర్శంగా తీసుకొని భక్తి మార్గంలో నడువాలన్నారు. ఆధ్యాత్మిక భక్తి మార్గంతో చెడు వ్యసనాలు దూరమైతాయన్నారు. నేటి యువ తరం కూడా భక్తి మార్గంలో నడుస్తేనే మోక్షానికి మార్గం లభిస్తుందన్నారు.అనతంరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సంత్‌లు లింగోజీ మహరాజ్, జంగో లింగో దీక్ష గురు ఆత్రం కిషన్ మహారాజ్, కుమ్రె వాసుదేవ్ మాహరాజ్, రాంషావ్ మహారాజ్ , మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆత్రం భగ్వంత్‌రావ్, వైస్ ఎంపీపీ ఆత్రం ప్రకాశ్, మాజీ సర్పంచ్‌లు ఆత్రం పద్మబాయి, మెస్రం భూపతి ఉన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థితో పీఈటీ, ఉపాధ్యాయురాలు

ఆసిఫాబాద్,ఫిబ్రవరి 8: మంచిర్యాల జిల్లా మందమర్రిలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి అత్యపత్య క్రీడల్లో అత్యంత ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు పట్టణం లోని సెంటిమేరీ హై స్కూల్‌కు చెందిన బొమ్మెన సైవర్ధన్ ఎంపికైయ్యాడు. ఈ నెల 9నుంచి 11వ తేదీ వరకు మహారాష్ట్రలోని సేవాగ్రంలో జరిగే జాతీయస్థాయి క్రీడల్లో పాల్గొంటాడని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మేరీ కేవీ, కరస్పాండెట్ సిస్టర్ జాన్సీ ,శిక్షణ ఇస్తున్న పీఈటీలు కడతల రాకేశ్, కిరణ్, అర్చన, క్లాస్ టీచర్ శైలజలతో పాటు పాఠశాల బృందం సైవర్ధన్‌ను అభినందించారు.

పకడ్బందీగా పారిశుధ్య కార్యక్రమాలు

రెబ్బెన, ఫిబ్రవరి 8: ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం పకడ్బందీగా నిర్వహిస్తున్నామని గ్రామ ప్రత్యేకాధికారి ప్రభాకర్, పరికిపండ్ల శ్రీనివాస్‌లు స్పష్టం చేశారు. రెబ్బెన, నేర్పల్లి గ్రామాల్లో పర్యటించి మురుగు కాలువలు, అక్కడక్కడ పెరిగిన పిచ్చి మొక్కలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు గ్రామాల్లో అంతర్గత రహదారులు శుభ్రంగా ఉండాలని, మురుగు కాలువలు శుభ్రం చేయడంతో పాటు పిచ్చి మొక్కలు ఎప్పటికప్పుడు తొలగించాలని, వాటర్ ట్యాంక్‌లు శుభ్రం చేయాలని, పారిశుధ్య పనుల్లో అలసత్వం వహించొద్దని సిబ్బందికి సూచించారు. ఎంపీటీసీ పెసరి మధునయ్య, పంచాయతీ కార్యదర్శి రవీందర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు లావుడ్య రమేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గం దేవాజీ, నాయకులు మో డెం సుదర్శన్‌గౌడ్, మోడెం చిరంజీవిగౌడ్, అన్నపూర్ణ మురళీగౌడ్, తిరుపతిగౌడ్‌లు ఉన్నారు.

● పరిసరాల పరిశుభ్రతే లక్ష్యం

వాంకిడి, ఫిబ్రవరి 8: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వాంకిడి ఇన్‌చార్జి ఎంపీడీవో మహేందర్ అన్నారు. మండల కేంద్రంలోని, ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులకు ఎంపీవో శివకుమర్‌తో కలిసి పారిశుధ్య వారోత్సవాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనులు నిర్వహించాలన్నారు. పాఠశాలల పరిసరాలు, రోడ్ల వెంట మురుగు కాల్వలు శుభ్రం చేయడం, వంటి పనులు చేపట్టాలని కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో వివిధ జీపీల కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ లకు చట్టాలపై అవగాహన


మాట్లాడుతున్న మహిళా సాధికారిత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ రాణి

కాగజ్‌నగర్ టౌన్, ఫిబ్రవరి 8 కాగజ్‌నగర్ మండలంలోని బాలాజీనగర్ సెక్టార్, మారుతినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రభుత్వ పథకాలు, చట్టాలపైన మహిళలకు అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సాధికారిత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ రాణి మాట్లాడుతూ మహిళలు పథకాలు,చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, బేటీబచావో బేటీ పడావో, సుకన్య సంవృద్ధి యోజన లాంటి పథకాలను సద్వినియోగించుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో అందిస్తున్న పోషకాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు, కిషోరబాలికలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గృహ హింస, పని ప్రదేశాలల్లో మహిళలకు ఎదురయ్యే లైంగిక వేధింపులకు 181 నంబరకు ఫోన్ చేయాలని, చిన్న పిల్లలకు వేధింపులకు గురైతే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కి ఫిర్యాదు చేయాలన్నారు. సురక్ష బీమా, సురక్ష జీవన్ జ్యోతి బీమా యోజన పథకాలపై అవగాహన కల్పించారు. సెక్టార్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు మంగ, విజయలక్ష్మి, సులోచన, హెల్పర్‌లు, గర్భిణులు, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-319433-AII

CHANGE OF NAME

★ I, SALLA VAISHNAVI, W/o. Salla Naresh, R/o. 14-126/6-19/A/1, Green City, Rangampet, Mancherial, TS. Changed My Name as SALLA VISHNAVI, W/o. Salla Naresh.
NT-311089

★ I, ODDI SARITHA, D/o. Oddi Lingaiah, R/o. 14-126/6-19/A/1, Green City, Rangampet, Mancherial, TS. Changed My Name as SALLA VISHNAVI, W/o. Salla Naresh.
NT-311089

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679

నిర్మల్: 91827 77671, 91827 77677